ప్రజలే న్యాయ నిర్ణేతలు..

- కొవ్వూరు రైల్వేలైన్ కోసం ఉద్యమిస్తాం..
- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సభ



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ప్రజా ప్రతినిధులు

సత్తుపల్లి: సీఎం కేసీఆర్ ఏమి ఇవ్వాలో అది ఇచ్చేశారు.. మిగిలింది రుణం తీర్చుకోవటమే.. అంతిమ నిర్ణేతలు ప్రజలేనని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. స్థానిక సాయిబాలాజీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు మరో మూడు, నాలుగునెలల్లోనే ఉన్నాయని ప్రజల అవసరాలను గుర్తించి విశ్వాసం చూరగొనేలా కార్యకర్తలు మసలుకోవాలన్నారు. సత్తుపల్లి–కొవ్వూరు రైల్వేలైన్ కేంద్ర ప్రభుత్వం తక్షణం వచ్చే బడ్జెట్ సమావేశాలలో నిధులు కేటాయించాలని ప్రతినిధుల సభలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. రాముడు పేరు చెప్పి ఓట్లు దండుకొనే బీజేపీ కేవలం 16 కిలోమీటర్లు రైల్వేలైన్ వేస్తే భద్రాచలం పుణ్యక్షేత్రం వస్తుందని తెలిసినా ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తలేదని విమర్శించారు. కొవ్వూరు రైల్వేలైన్ కోసం ఉద్యమించి సాధించేవరకు కేంద్రంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ మేరకు సత్తుపల్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పార్కులో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా 200 అడుగుల అభివృద్ధి, సంక్షేమ పథకాల భారీ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కూసంపూడి మహేష్, తోట సుజలరాణి, ఎంపీపీ దొడ్డా హైమావతి, జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, ఎస్‌కె రఫీ, మల్లూరు అంకమరాజు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేద్దాం..

- వైరా సమ్మేళనంలో ఎంపీ నామా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు

వైరా: రానున్న ఎన్నికల్లో ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త సైనికుల్లా పనిచేసి సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేయాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం వైరాలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించాక కమ్మ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నాడు కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్.. అధికారం చేపట్టాక రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా అద్భుత పాలన చేస్తుందన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈక్రమంలోనే దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు సీఎం కేసీఆర్ బీఆర్ఎస్‌ను స్థాపించినట్లు ఎంపీ తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక ఏనాడూ పల్లెల్లో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ నేతృత్వాన జరిగిందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్ముడు జాతిపిత అయితే.. తెలంగాణను సాధించిన సీఎం కేసీఆర్ తెలంగాణ జాతిపిత అని చెప్పారు. 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న తెలంగాణలో 56 లక్షల వరి సాగైందని.. ఇందుకు కేసీఆర్ దార్శనికతే కారణమని తెలిపారు. కాగా, సభ ముగియకముందే కార్యకర్తలు పలువురు వెళ్తుండడంతో ఎమ్మెల్యే రాములునాయక్ అసహనం వ్యక్తం చేశారు. మండల అధ్యక్షులు సమన్వయంతో వ్యవహరించాలని, లేనిపక్షంలో పదవులనుంచి తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, నాయకులు పసుపులేటి మోహన్‌రావు, కట్టా కృష్ణార్జున్‌రావు పాల్గొన్నారు.

నీటి నిల్వ ఘనత కేసీఆర్‌దే..

- మధిరలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

మధిర: బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేసినట్టుగా వినూత్న ప్రణాళికలతో రాష్ట్రంలో నీటిని నిల్వ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మధిర రెడ్డి గార్డెన్స్ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రతినిధుల సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ చేస్తున్న కృషి, ప్రవేశపెట్టిన పథకాలను గమనించి దేశ ప్రజలు ఆయన్నుయ కోరుకోవడంతో పార్టీని జాతీయ పార్టీగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బీజేపీని ఓడించే సత్తా కేసీఆర్‌కు మాత్రమే ఉందన్నారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయన్నారు. కాంగ్రెస్ హయాంలో పర్యాటకం పేరుతో ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పార్టీ మధిర నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ బొమ్మెర రామ్మూర్తి మాట్లాడుతూ.. తాను తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నప్పుడు ఈ వేదికపై ఉన్నవారు ఏ ఒక్కరు కూడా పార్టీలో లేరని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, మల్లాది వాసు, మొండితోక లతాజయాకర్, లలిత, శీలం విద్యాలత వెంకటరెడ్డి, బిక్కి కృష్ణ ప్రసాద్, బీవీఆర్, బంకా మల్లయ్య, పోట్ల ప్రసాద్, పసుపులేటి దుర్గ, కరివేద సుధాకర్, కూనా నరేందర్ రెడ్డి, అబ్బూరి రామన్, బంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

ముదిగొండ: మండల పరిధిలోని మేడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు బస్ పాస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ పాస్‌లను ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

సత్తుపల్లిటౌన్: వివిధ రంగాల్లో పని చేస్తున్న హమాలీలకు, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు మోరంపూడి పాండు రంగారావు, కొలికపోగు సర్వేశ్వరరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన హమాలీల సమావేశంలో మాట్లాడుతూ... 50 ఏళ్లు నిండిన హమాలీలకు నెలకు రూ.10 వేలు చొప్పున పింఛన్ ఇవ్వాలని, కార్మికులు అనారోగ్యానికి గురైతే పాలకుల బాధ్యత వహించడం లేనిదన్నారు. ఈ కార్యక్రమంలో వలి, వెంకటేశ్వరరావు, చంద్రం, రామకృష్ణ, బాబు, జిలాని, సైదా, రవి, వెంకటప్ప, బుడే, భాష, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు లబ్ధిదారుల ఎంపిక

కొణిజర్ల: దివ్యాంగులకు స్వయం ఉపాధి నిమిత్తం 2022–23 సంవత్సరానికి గాను దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ రుమావత్ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల కోసం దరకాస్తు చేసుకున్న దివ్యాంగులంతా సంబంధిత ధృవపత్రాలతో హాజరు కావాలని తెలిపారు. లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వైరారూరల్: వైరా కేవీకే సమీపాన జాతీయ ప్రధాన రహదారిపై వ్యాన్‌ను టిప్పర్ ఢీకొట్టగా వ్యాన్ డ్రైవర్ వల్లెపు పున్నారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఐఎంఎఫ్ఎల్ గోదాం నుంచి మద్యం పెట్టెలతో మంగళవారం వైరా వైపు వస్తున్న వ్యాన్‌ను వైరా నుంచి తల్లాడ వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్ అదుపుతప్పి రోడ్డు కిందకు దిగి ఢీకొట్టగా డ్రైవర్ పున్నారావు తీవ్రంగా గాయపడ్డాడు.

శ్మశానవాటిక స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు

వైరా, కొణిజర్ల: వైరా మున్సిపాలిటీ రెండో వార్డుకు చెందిన కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు రెవెన్యూ పరిధిలో శ్మశాన వాటికను కొణిజర్ల తహసీల్దార్ దొడ్డారపు సైదులు మంగళవారం ఐబీ డీఈ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున స్థలానికి చేరుకుని శ్మశానవాటికను కొంత మంది ఆక్రమించుకుని తమను అందులోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ సైదులు తక్షణమే సర్వే చేయించి శ్మశాన వాటిక స్థలానికి హద్దులు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్వేయర్ ధనలక్ష్మి, వార్డు అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారం



తాగునీటిని పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: మండలంలోని గట్ల గౌరారం పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో కొన్ని రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యపై మంగళవారం ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు స్పందించారు. తాత్కాలిక పరిష్కారంగా పంచాయతీ సర్పంచ్ వెర్రు వెంకటరావు, కార్యదర్శి నాగేశ్వరావులతో మాట్లాడి ట్యాంకర్ ద్వారా గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేయించారు. సమస్యపై జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ స్పందించారని జిల్లా పరిషత్ నిధుల నుంచి తాగునీటి బోర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని తమకు సూచించారని ఎంపీడీఓ తెలిపారు. బోరు నిర్మాణానికి అవసరమైన నిధుల అంచనా సిద్ధం చేయాలని మిషన్ భగీరథ మధిర ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

మధిర నుంచి పోటీ చేస్తాం..



మాట్లాడుతున్న భాస్కర్

చింతకాని: కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న మధిర నియోజకవర్గంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం పోటీ చేస్తుందని పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలడుగు భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాటాల గడ్డ మధిర నుంచి గతంలో ప్రశ్నించే గొంతుక అసెంబ్లీలో ఉండేదని, వచ్చే ఎన్నికల్లో మధిర నుంచి పార్టీ గెలిచి అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను అవలంభిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కమిటీ సభ్యులు వత్సవాయి జానికిరాములు, నన్నక కృష్ణమూర్తి, తోటకూరి వెంకటనర్సయ్య, ఆలస్యం రవి, దేశబోయిన ఉపేందర్, కాటబత్తిన వీరబాబు, పులియజ్ఞనారాయణ, గడ్డం రమణ పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ దొడ్డా శ్రీనువాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దొడ్డా శ్రీనువాసరావు మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే 90 శాతం రోడ్లు పూర్తయ్యాయనీ, మిగిలిన రోడ్లను కూడా సీసీ వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోపెల కృష్ణయ్య, దొడ్డా చిన్న శ్రీనువాసరావు, మారెళ్ల దేవేంద్ర, దుగ్గినేని సత్యనారాయణ, తాళ్లూరి రాములు, కృష్ణయ్య, ఎస్.కె.జానీ, ముచ్చింతల నరసింహారావు, ఇస్నేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలపై పెరిగిపోతున్న అఘాయిత్యాలు



మాట్లాడుతున్న నాయకులు

కారేపల్లి: రోజురోజుకు దేశంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, చట్టాలు పటిష్టంగా అమలు చేయటంలో పాలకులు విఫలమయ్యారని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.లక్ష్మి, వై.జానకి అన్నారు. మంగళవారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ఈ నెల 27, 28వ తేదీల్లో కారేపల్లిలో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ మూడు జిల్లాలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. పలు అంశాలపై రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించబడుతాయన్నారు.

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

పెనుబల్లి: వేసవి సెలవుల్లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని తెలంగాణా ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెనుబల్లిలో ఏర్పాటు చేసిన టీపీటీఎఫ్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, ప్రమోషన్లు చేపట్టి పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు బదిలీల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వి. మహేష్, ఉపాధ్యక్షుడు వై. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డి. శ్రీని, ఎం. నాగేశ్వరరావు, చిన్నరాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ బోధన

వైరారూరల్: మండల పరిధిలోని రెబ్బవరం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వేసవి సెలవుల్లోనూ సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు అందించాలనే లక్ష్యంతో మంగళవారం కంప్యూటర్ విద్య టీచర్లు నియమించి బోధించారు. గతేడాది పాఠశాల పూర్వ విద్యార్థి కొల్లి రామారావు, లక్ష్మీలు పాఠశాలకు రూ.4 లక్షలు విలువ చేసే 10 కంప్యూటర్లు వితరణగా అందించారు. విద్యార్థులు కంప్యూటర్ విద్య, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించేందుకు టీచర్లను నియమించి బోధించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు వితరణ

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి గ్రామంలో అయ్యప్ప స్వామి దేవాలయంలో అభయాంజనేయ స్వామి రాతి విగ్రహం ప్రతిష్ఠకు మంగళవారం చింతకాని మండలం పందిళ్లపల్లికి చెందిన వజ్రాల వెంకటకృష్ణ, రమాదేవి దంపతులు రూ.20 వేలు వితరణగా అందజేశారు. అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ అన్నెం కోటారెడ్డికి నగదు అందజేశారు.

జాతీయ సాహిత్య సంబురాలకు ఆహ్వానం



బత్తిన గీతాకుమారి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి చెందిన ప్రముఖ కవయిత్రి, విశ్రాంత ఉపాధ్యాయిని బత్తిన గీతాకుమారికి ఈ నెల 30 హైద్రాబాద్ పఠాన్ చెరువులో జరిగే తెలుగు వెలుగు సాహిత్యవేదిక, ఎస్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జాతీయ సాహిత్య సంబురాలు'కు ప్రత్యేక ఆహ్వానం అందింది. తెలుగు వెలుగు నిర్వాహకులు పీఆర్ఎస్ మూర్తి, మోటూరు నారాయణరావు నుంచి వ్యక్తిగతంగా ఆహ్వానం అందించారు. ఉగాది సాహిత్య సంబురాల సంకలనానికి తన కవిత ఎంపికై నందుకు గీతాకుమారికి బిరుదు ప్రదానం, సత్కారంతో పాటు జ్ఞాపికను అందించటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పురస్కారం అందుకున్న బనిగండ్లపాడు వాసి



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడుకు చెందిన కేయూ ప్రొఫెసర్ డాక్టర్ పెదమళ్ల శ్రీనివాసరావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

అంగన్‌వాడీల్లో వార్షికోత్సవ సంబురాలు



పిల్లలు, తల్లులకు అవగాహన

వైరారూరల్: మండలంలోని గన్నవరం, గొల్లపూడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం వార్షికోత్సవ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్‌పై తల్లులకు అవగాహన కల్పించి పిల్లల లోపాలను గుర్తించి ఎలాంటి ప్రోత్సాహకం కోసం అవసరమయ్యే అంశాలను తెలియజేశారు. ఈ కార్యాక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ షేక్. బీజాన్‌బీ, అంగన్వాడీ టీచర్లు అనిత, పద్మజ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

కారేపల్లి: మండల పరిధిలోని వెంకిట్యాతండా యువకులు నిరుపేద కుటుంబానికి క్వింటా బియ్యాన్ని మంగళవారం వితరణగా అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన జర్పుల సోమ్లా అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి క్వింటా బియ్యంతో పాటు, నిత్యవసరాలను వితరణగా అందజేశారు. వార్డు మెంబర్ బాణోతు బాలునాయక్, మాలోతు శోభన్‌బాబు, బాణోతు భాస్కర్, జర్పుల జగన్, లాలునాయక్, గుగులోతు బాబులాల్, భూక్య భావ్‌సింగ్, పరుశురాం, బన్సిలాల్, శివలాల్, భావ్‌సింగ్, రాందాస్, బిచ్చు, అఖిల్, మోహన్, సోనియా, ప్రేమ్, చంటి, వీరన్న, ఉపేందర్, విజయ్, మహేందర్, మల్సూర్, సాయి, ఇంద్రజిత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోనకల్: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోళ్లను ప్రారంభించలేదని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయాధికారి అబ్బూరి శరత్‌బాబుకు సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మాట్లాడుతూ... మండలంలో 9 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి ఇప్పటి వరకు ఒక్క కొనుగోలు కేంద్రంలో కూడా ధాన్యం కొనుగోలు ప్రారంభించలేదన్నారు. ఇదే అదునుగా దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూము రోషన్‌కుమార్, ఏలూరి పూర్ణచందర్‌రావు, బొమ్మినేని నాగేశ్వరావు, పరుచూరి చిట్టిబాబు, బొమ్మినేని ప్రభాకర్‌రావు, కొంగర పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెనుబల్లి: మండల పరిధిలోని గౌరారంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు మంగళవారం ప్రారంభించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను అమ్ముకుని మద్దతు ధర పొందుకోవాలన్నారు. కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ చెక్కిలాల లక్ష్మణరావు, ఏపీఎం నాగపుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఈఐఆర్ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: సెల్‌ఫోన్ దొంగిలించినా, ఎక్కడైనా పోగొట్టుకున్నా వాటిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ సేవల్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు. మండలంలో చోరీకి గురైన ఫోన్లను రికవరీ చేసి మంగళవారం అందజేశారు. ఇటీవల ఫోన్లను పోగొట్టుకున్న యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ఫోన్లను గుర్తించినట్లు ఎస్సై తెలిపారు.

కల్లంలో మిర్చి చోరీ

పెనుబల్లి: ఆరుగాలం పండించిన మిర్చి పంటను కల్లంలో ఆరబోస్తే గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మండలంలోని గౌరారానికి చెందిన రైతు భూమా ముత్తయ్య గౌరారం టోల్‌ప్లాజా వద్ద కల్లంలో మిర్చి ఆరబోశాడు. ఈ మేరకు రూ.లక్ష విలువైన మిర్చిని సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వెల్లడించారు.

దోమల నిర్మూలనతో మలేరియా అంతం



సత్తుపల్లిటౌన్: గంగారంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సత్తుపల్లిటౌన్: దోమలు నిర్మూలిస్తే మలేరియాను పూర్తిగా అరికట్టొచ్చని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు ప్రమీలారాణి, అన్నమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అదే విధంగా జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పానెం రామచంద్రరావు ఆధ్వర్యాన అవగాహన సదస్సు నిర్వహించారు.

చింతకాని: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, వైద్యసిబ్బంది రత్నకుమారి, రమా, సుధాకర్, శ్రీనివాస్, ఉదయ్, సైదులు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో దోమల నిర్మూలనపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పుర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అల్తాఫ్, సూపర్ వైజర్ పెద్ద పుల్లయ్య, రాజేశ్వరీ, శారద, అన్నపూర్ణ, అరుణిమ, నిర్మల, మరియమ్మ, శ్రావణి పాల్గొన్నారు.



చింతకానిలో..



తల్లాడలో..

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అన్ని గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. పలు చోట్ల ర్యాలీలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిరూరల్: సదాశివునిపేటలో పార్టీ జెండా ఆవిష్కరణ..



ఏన్కూరులో..



ఎర్రుపాలెంలో..